ప్రజాశక్తి
బుధవారం 2 ఆగస్టు 2023 5
పార్వతీపురం మన్యం

మినీ జాబ్‌మేళాకు 116 మంది హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీసాయిరాం డిగ్రీ కాలేజీ ఆవరణంలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ మినీ జాబ్ మేళాకు శ్రీరాం ఫైనాన్స్ ఇన్సూరెన్స్, సీనరైజ్ కాస్ట్ లిమిటెడ్, నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు 116 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, అందులో 45 మంది పై కంపెనీల్లో ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. శ్రీ సాయిరాం డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ పెంట అప్పారావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది మొదటిసారని ఇలాంటి కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ మనోజ్ కుమార్, ఎపిఎస్ఎస్‌డిసి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పత్రిక ప్రజాశక్తి

- 43వ వార్షికోత్సవ సభలో వక్తలు
- ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల కష్టాలు, కన్నీళ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం దిశగా తన వంతు పాత్రపోషిస్తున్న ప్రజాశక్తి ప్రజల పత్రిక అని పలువురు వక్తలు కొనియాడారు. ఈ పత్రిక కార్మిక, కర్షక బంధువు అని పేర్కొన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవసభ మంగళవారం రెవెన్యూ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ జిఎస్ఎన్ రాజు, సిఐటియు రాష్ట్రప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, రాష్ట్రకార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.రమేష్, సిపిఎంజిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం ప్రజాశక్తి స్టాఫ్‌రిపోర్టర్ కె.రమేష్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సభలో జిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రజాశక్తి నిలబడింది అంటే అది ప్రజల సహకారం ద్వారానేనని అన్నారు. ఎటువంటి స్వార్థం లేకుండా, ప్రజా హితం కోసం పని చేస్తున్న ఏకైక పత్రిక ప్రజాశక్తి అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్న పత్రిక భవిష్యత్‌లో మరింత వద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ ప్రజాశక్తికి ప్రజలే యజమానులని, కష్ట జీవుల కష్టాన్ని అక్షర రూపంలో రాసే పత్రిక అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు ప్రజల పక్షాన లేవని, ధనవంతులు పక్షాన ఉన్నాయని అన్నారు. పేదవాడి కష్టాలను,కన్నీటిని పాలకుల దృష్టికి తీసుకెళ్తుందన్నారు. జిల్లాలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయని, అదే బాటలో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలను మూసివేసేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని వాటిని రక్షించుకునేందుకు, కార్మికుల ఉపాధి కోసం ప్రజాశక్తి పత్రిక కృషి చేయాలని పిలుపునిచ్చారు. వలసలు జిల్లాగా మారిపోతున్న పరిస్థితులపై కథనాలు రాసి జిల్లా ప్రజలకు అండగా నిలబడాలని కోరారు. ఐఅండ్‌పిఆర్ ఎడి డి.రమేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వాలు దష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తోందన్నారు. ప్రజలు సమస్యల ప్రతి బింబంగా నిలిచే ప్రజాశక్తి మరింత దిన దినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ కార్మిక వర్గ పోరాటాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాశక్తి అగ్రభాగాన నిలుస్తుందన్నారు. కార్మిక వర్గ రాజ్యం కోసం, కార్మిక హక్కులు కాపాడటం కోసం జరిగే పోరాటాలకు అండగా ఉంటోందన్నారు. ప్రజాశక్తిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా కార్మిక ,కర్షక ఉద్యమాల బలోపేతం చేయడానికి దోహద పడుతుందన్నారు. తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజాశక్తి కార్మిక,కర్షక, పీడిత ప్రజల పుత్రిక అన్నారు. ప్రతి అక్షరం ప్రజలు పక్షం అన్నా ట్యాగ్ లైన్ కు అనుగుణంగా ప్రజల కోసం పని చేస్తున్న పత్రిక ను మరింత పెంచి ప్రజలు ల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. 40 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాసే నేటి పరిస్థితుల్లో ప్రజాశక్తిని పెంచుకోవడం ద్వారా కార్మిక హక్కులను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుంది అని అన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది, కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ యూనివర్శిటీ ఛాన్సలర్ , ఐఅండ్‌పిఆర్ ఎడి, సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించాలంటూ

మున్సిపల్ కార్యాలయాల ముట్టడి

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపల్ కార్యాలయాలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ముట్టడించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ కార్యాలయాల్లో అధికారులను, ఉద్యోగులను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆందోళన వద్దకు చేరుకున్న పోలీసులు కార్మికులను, నాయకులను అదుపులోకి తీసుకున్నారు. సాలూరులో 24మందిని, పాలకొండలో 58మంది కార్మికులను, నాయకులు అదుపులోకి తీసుకొని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పలువురు కార్మికులు, నాయకులు అరెస్టు, విడుదల

సాలూరులో కార్మికులను అరెస్టు చేసేందుకు లాక్కెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి - సాలూరు

సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ముఖద్వారం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన కార్మికులు బైఠాయించారు. కార్యాలయం ముందు వెనుక ద్వారాల వద్ద కార్మికులు బైఠాయించారు. దీంతో మున్సిపల్ ఉద్యోగులు సుమారు రెండు గంటల పాటు బయటనే నిరీక్షించాల్సి వచ్చింది. మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులు పట్టణ సిఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి కార్మికులను అడ్డు తొలగించారు. టౌన్ ఎస్ఐలు నర్సింహమూర్తి మూర్తి, భాస్కరరావు ఆధ్వర్యాన పోలీసులు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్వైనాయుడుతో పాటు 25మందిని కార్మికులను అరెస్టు చేశారు. అంతకు ముందు కార్మికుల నుద్దేశించి ఎన్వై నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేశారని చెప్పారు. గడచిన నాలుగేళ్లలో ఏటా కార్మికులకు పంపిణీ చేయాల్సిన చెప్పులు, సబ్బులు, నూనెలు పంపిణీ చేయలేదని చెప్పారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు టి.రాముడు, టి.శంకరరావు, టి.ఇందు, ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, డర్రు సంతోష్ పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధ, ఉపాధ్యక్షులు వి.ఇందిర డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ప్రాంగణం వద్ద కార్మికులు బైఠాయించి, నిరసన తెలియజేస్తూ కార్యాలయాన్ని ముట్టడి చేశారు. ఒకానొ దశలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు కార్యాలయంలోని విధులు నిర్వహిస్తున్న అధికారులు కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా, కార్మికులు వారిని లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వివాదం జరిగి స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం కార్మికులు కార్యాలయం ముందు బైఠాయించారు. కొంత సమయం తర్వాత సిఐ కృష్ణారావు మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని కమిషనర్ జె.రామ అప్పలనాయుడుతో సమావేశమై కార్మికులతో మాట్లాడించారు. ఈ సందర్భంలో కమిషనర్‌తో కార్మికులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగమైన కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి నాలుగేళ్లయినా నేటికీ ఆ హామీని అమలు జరపలేదని అన్నారు. పర్మినెంట్ కార్మికులకు ఇచ్చిన వేతనాన్ని తమకు కూడా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేయాలని, హెల్త్ అలవెన్స్ విడుదలకు చర్యలు చేపట్టాలని, పట్టణంలో పెరుగుతున్న జనాభాకు తగినంత మంది కార్మికుల సంఖ్యను పెంచి ఉన్న కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ మీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసనను విరమించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పట్టణ నాయకులు సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు, కార్మికులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేషు, నాగవంశం నిర్మల, పడాల గాంధీ, మామిడి శివ, బంగారి రాజేష్, బంగారి రవి, మహిళా కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు పాల్గొన్నారు.

పాలకొండ: సమస్యలను రపిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయాన్ని కార్మికులు ముట్టడించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల న్యాయమైన పోరాటానికి అన్ని వర్గాలు కోరారు. తొలుత నగరపంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు బైఠాయించి అధికారులను, సిబ్బందిని ఎవర్నీ లోపలికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో కార్మికులకు నగర పంచాయతీ మేనేజర్‌కు వాగ్వివాదం జరిగింది. వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు పాటు కాద రాము మున్సిపల్ కార్మికులు 58 మందిని అరెస్టు చేసి వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఐక్య పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర పంచాయతీ అధ్యక్షులు పడాల భాస్కరరావు, కార్యదర్శి చింతల సంజీవి, కోశాధికారి పడాల వేణు, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కార్యవర్గ సభ్యులు రఘు, శ్రీదేవి, విమల, వండాన ఆంజనేయులు, సిఐటియు మండల సమన్వయ కమిటీ కార్యదర్శి కాద రాము, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, వాటర్ సెక్షన్ ట్రాక్టర్ డ్రైవర్లు వివిధ విభాగాల పనిచేస్తున్న కార్మికులతో పాటు పారిశుద్ధ్య కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాలకొండలో కార్మికులను అరెస్టు చేసి వ్యాన్‌లో స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

పార్వతీపురంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులు

విజయవంతంగా సురక్ష : కలెక్టర్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

సామాజిక భద్రత కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సురక్ష క్యాంపులు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ విజయవంతం మైందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెలరోజుల పాటు పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు చేసిన అవిరాళ కృషి వల్ల సురక్ష కార్యక్రమం విజయవంతమైందన్నారు. నిర్ణీత కార్యాచరణ ప్రకారం వారం రోజులు ముందుగా వాలంటరీ వ్యవస్థ ద్వారా పౌరుల అపరిష్కృత సమస్యలను గుర్తించి, వారికి ప్రత్యేక టోకెన్ కేటయించి, 11 రకాల ధ్రువపత్రాలను గ్రామస్థాయిలోనే మంజూరు చేశామని చెప్పారు. పార్వతీపురం, పాలకొండ డివిజన్‌లో దాదాపు 96శాతం దరఖాస్తులను పరిష్కరించామన్నారు. సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా 133684 టోకెన్‌లు మంజూరు చేయగా, అందులో 127493మందికి సేవలు అందించామని, 122300 దృవపత్రాల మంజూరు చేశామని, మిగతా వాటికి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి 15రోజుల్లో పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి శ్రమించిన అన్ని శాఖల వారికి అభినందనలు తెలియ జేస్తున్నట్లు కలెక్టర్ తెలియజేశారు.

మణిపూర్ సిఎంను బర్తరఫ్ చేయాలి

మహిళలకు ప్రధాని క్షమాపణ చెప్పాలి : సిపిఎం

ప్రజాశక్తి - బెలగాం

మణిపూర్‌లో మారణ హెూమాన్ని ప్రజాతంత్రవాదులంతా ఖండించాలని, మహిళలను అత్యాచారం చేసి, చంపిన వారిని కఠినంగా శిక్షించాలని మణిపూర్ సిఎం బీరెన్ సింగ్‌ను బర్తరఫ్ చేయాలని, మోడీ మహిళలకు క్షమాపణ చెప్పాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మణిపూర్‌లో కుకి తెగ ఆదివాసీ గిరిజనులుగా జీవిస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అభివృద్ధి చెందిన మెజార్టీ కులమైన మోయితే తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయం తీసుకోవడంతో అక్కడ హింస చెలరేగిందన్నారు. కుకీ, నాగ తెగలను కొండల నుంచి తగిలేసి విలువైన అటవీ సంపద, ఖనిజాలు, గనులను కార్పొరేట్లకు అప్పజెప్పడంలో భాగమే బిజెపి ప్రభుత్వం మైనింగ్ మాఫియా కుట్ర అని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళిత, గిరిజ, ముస్లిం, క్రిష్టియన్ మతస్తులకు, మహిళలకు రక్షణ లేదని అన్నారు. ఇంత దుర్మార్గం జరుగుతున్నా మనరాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి వంత పాడడం తప్ప మణిపూర్ ఘటనను ఖండించడం లేదని అన్నారు. ఇప్పటికైనా మణిపూర్ హింసపై పార్లమెంటులో అన్ని పార్టీలు చర్చించి హింసను కేంద్ర ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు, మహిళ్లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బిజెపి విద్వేష విచ్ఛిన్నకర రాజకీయాలను ప్రతిఘటించాలని, ఈ చర్యను ప్రజలంతా ఖండించాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, వై.మన్మధరావు, వి.ఇందిర పాల్గొన్నారు.

4న ఆర్ఐటిఐ కౌన్సిలింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2023-24 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 3న జరగాల్సిన కౌన్సిలింగ్ ప్రక్రియ మన్యం బంద్ కారణంగా ఆగస్టు 4కు వాయిదా వేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆగస్టు 4న ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ కు హాజరు కావాలని ఆయన కోరారు.

3న ఐటిఐ లో కౌన్సిలింగ్

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 3న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకష్ణ తెలిపారు. రిజిస్ట్రేషన్ అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు

గిరిజన గ్రామాలకు ఆధార్ సేవలు

ప్రజాశక్తి - సీతంపేట

మారుమూల గిరిజన గ్రామాల గిరిజనులకు సత్వరమే ఆధార్ సేవలందించాలని ఎపిఒ వై.రోసిరెడ్డి అన్నారు. బ్లూ 3 ఐటి సొల్యూషన్స్, విద్యాశాఖ సౌజన్యంతో కొత్తగా మంజూరు చేసిన 5 ఆధార్ మొబైల్ కిట్స్ సీతంపేట వైటిసిలో ఎపిఒ చేతుల మీదుగా యూనిట్ కిట్లను ఆపరేటర్లకు అందజేశారు. గిరిజన గ్రామాల్లోకి వెళ్లి వారికి అవగాహన కల్పించి, వారికి అవసరమయ్యే సేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లూ 3 ఐటి సొల్యూషన్ రీజనల్ మేనేజర్ డేవిడ్ కమలాకర్, కోఆర్డినేటర్లు డేవిడ్, నాగరాజు రాజారావు మరియు ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి అవినాష్

3న మన్యం బంద్

ప్రజాశక్తి - కలెక్టరేట్

మణిపూర్ ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాదశక్తుల పైశాచిక మరణహెూమాన్ని ఆపాలని కోరుతూ ఈనెల 3న మన్యం బంద్‌కు ప్రజలంతా సహకరించి జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మణిపూర్ ఆదివాసీలపై కార్పొరేట్, మతోన్మాద శక్తుల పైశాచిక మారణహెూమాన్ని ఆపాలని, మోడీ ప్రభుత్వం తెచ్చిన నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని రద్దు చేయాలని, బోయవాల్మీకిలను ఎస్టీ జాబితాల్లో చేర్చొద్దని, ఎపి అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలన్నారు. జిఒ 3 రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, నాన్ షెడ్యూల్డ్ ఏరియా గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు, చీదరపు అప్పారావు, సీతారాం, మోహన్ రావు, జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కురుపాం : మణిపూర్ లో ఆదివాసీల పై జరుగుతున్న దమన కాండకు నిరసనగా ఆదివాసీ సంఘాలు పిలుపు మేరకు ఆగస్ట్ 3 న జరుగు రాష్ట్ర మన్యం బంద్ కు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆదివాసల హక్కులు పరిరక్షణ వేదిక అధ్యక్షులు కె.లక్షణమూర్తి తెలిపారు. నాలుగు నెలలుగా ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం అండతో జాతులు, మతాల మధ్య చిచ్చు పెట్టి, అభివృద్ధి చెందిన కుల, మతాలకు ఎస్‌టి హోదా కల్పిస్తూ కల్పిస్తూ నిర్ణయం చేయడం అక్కడ ఆదివాసీలుగా ఉన్న కుకీ, నాగాలు దీనికి వ్యతిరేకంగా నిరసన తెలిజేయడం, దాన్నీ సహించ లేని బీజేపీ ముసుగులో ఉన్న ఆర్ఎస్ఎస్ మూకలు పాశవికంగా దాడులు చేసి హత్యలు చేయడం మహిళలను నగ్నంగా ఊరేగించడం దారుణమన్నారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం గూర్చి విదేశాల్లో ఉపన్యాసాలు చేసే ప్రధాని పార్లమెంట్‌లో విపక్షాలు డిమాండ్ చేస్తుంటే ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. నైతిక విలువలున్న మణిపూర్ ముఖ్యమంత్రి ఐతే బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని, వీటన్నికి నిరసనగా జరుగు మన్యం బంద్‌కు ప్రజలంతా సహకరించాలని కోరారు.

ఓటరు నమోదుకు సహకరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటరు నమోదు కార్యక్రమానికి సహకరించాలని ఆర్‌డిఒ కె.హేమలత అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికి ఓటరు ధ్రువీకరణ కార్యక్రమానికి ఎన్నికల సంఘం బూత్ లెవల్ ఏజెంట్లను అనుమతించిందని ఆమె చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు సమర్పించిన దరఖాస్తులు అన్నింటికీ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని స్పష్టం చేశారు. డూప్లికేట్ ఎంట్రీలు, చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలు పరిశీలన, ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే వాటిని గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. చిరునామాను మార్చుకున్న ఓటర్ల వివరాలు, డోర్ నంబర్ అడ్రస్ వెరిఫికేషన్ (10 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లు) చేస్తారని చెప్పారు. ఇంటి నెంబర్లకు సంబంధించిన ఎంట్రీల సవరణ కోసం ఫారం-8 సేకరించడం జరుగుతుందని ఆమె వివరించారు. సమావేశంలో తహాశీల్దార్లు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పశుసంర్ధకశాఖ అధికారిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

జంతువుల పట్ల మానవతా దృక్పథంతో మెలగాలి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

జంతువుల పట్ల మానవత దృక్పథంతో మెలగాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని అన్నారు. సబ్ కలెక్టర్ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువుల పట్ల క్రూరత్వ నివారణపై మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడు తూ జంతువులను అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. జంతు సంరక్షణ చట్టాల ద్వారా జంతువుల అక్రమ రవాణాను నిరోధించేలా కృషి చేయాలన్నారు. స్థానిక తహశీల్దార్ అధ్యక్షతన మండల స్థాయి ఎస్‌పిసిఎ (జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించే సొసైటీ) కమిటీల ఏర్పాటు చేయాలన్నారు. జంతు సంక్షేమ సంస్థలు, స్థానిక అధికారులు జంతు జనన నియంత్రణ (ఏ బి సి) నమోదును జంతు జనన నియంత్రణ నియమాలు అనుగుణంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. అనుమతి లేని చికెన్, మటన్ విక్రయ కేంద్రాలను అధికారులు సందర్శించి ఆ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జంతువుల రవాణా కోసం ఉపయోగించే వాహనాల్లో జిపిఎస్ ట్రాకర్‌ను పరిశీలించాలన్నారు. స్కూల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం వల్ల జంతువుల పట్ల పిల్లలకు అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. కేదారపురం వద్ద అక్రమ పశువుల బేస్ క్యాంపుల పరిశీలించాలన్నారు. గ్రామాల్లో కోళ్ల, మేకలు,గొర్రెల పందాలను అరికట్టేందుకు తోడ్పడాలి తెలిపారు. కార్యాక్రమంలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.మాణిక్యరావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి.సిద్దార్థ, డిఎల్‌పిఒ జె.రామప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, ఎస్ఐ బి.శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లబురిడిలో టిడిపి నాయకులను కలుస్తున్న నియోజకవర్గ ఇన్చార్జి విజయచంద్ర

పార్టీని బలోపేతం చేస్తా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

టిడిపిని పార్వతీపురం నియోజకవర్గంలో బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త గడపతొక్కుతానని ఆపార్టీ ఇన్‌చార్జ్ బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లబురిడిలో పర్యటించిన ఆయన ముందుగా గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం గ్రామంలోని టిడిపి నాయకుల ఇళ్లకు వెళ్లి టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, కష్టించిన కార్యకర్తలకు గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని అన్నారు. శక్తివంచనలేకుండా కృషి చేసి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని, అందుకు తమ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొగ్గమోహనరావు, కార్యదర్శి బోను చంద్రమౌళి, అరకుపార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, బేత లక్ష్మణరావు, మధుసూధనరావు బుడితిశ్రీరామ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో పిఒ తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం పి.టి.మండ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, సరుకుల లభ్యత రిజిస్టర్లను పిఒ తనిఖీ చేశారు. జగనన్న విద్యా కిట్లు పంపిణీ తనిఖీ చేసి విద్యార్థులు అందరికీ కిట్లు అందాయని ఆరా తీశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాల తయారీలో ఎటువంటి అశ్రద్ధ ఉండరాదని స్పష్టం చేశారు. విద్యా బోధనలో మరింత దృష్టి సారించాలని, ఆదర్శంగా నిలవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రాజన్నదొర

జోరు వానలోనూ గడపగడపకు

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో రెండో రోజు మంగళవారం జోరు వానలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుండి ఎడతెరిపిలేని వర్షాన్ని లెక్కచేయకుండా ఇంటింటికి వెళ్లి తమ ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్ళి గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గురించి చదివి వినిపించారు. కొంతమంది ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను పిలిచి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు మీసాల నారాయణ, ఇజ్జాడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, మీసాల చంటి, పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ జి.పార్వతి, ఎఒ కె.తిరుపతిరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కళావెంకట్రావుకు బొకేను అందజేస్తున్న వీరేష్ చంద్రదేవ్

కళాను కలిసిన వీరేష్ చంద్రదేవ్

ప్రజాశక్తి -కురుపాం

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కళా వెంకటరావును కురుపాం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు వైరచర్ల వీరేష్‌చంద్రదేవ్ మంగళవారం తన ఇంటి వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరేష్ దేవ్ మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో టిడిపి పరిస్థితులు తెలుసుకొని అనంతరం ప్రతి కార్యకర్తను కలుసుకొని అండగా ఉంటామన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకొని వస్తే నియోజకవర్గంలో పార్టీ బలోపేతం అయ్యి టిడిపి గెలుపు సునాయాసం అవుతుందని ఆయన అన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈయను తో పాటు కురుపాం నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఇఒల సంఘం జిల్లా అధ్యక్షులుగా సామల

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండల విద్యాశాఖాధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు బలిజిపేట ఎంఇఒ సామల సింహాచలం ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఎంఇఒల సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ వివరాలిలా ఉన్నాయి. జిల్లా గౌరవ అధ్యక్షులుగా జె.నారాయణస్వామి, అధ్యక్షుడిగా సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నాగభూషణ రావు, ట్రెజరర్‌గా ముమ్వల వెంకటరమణ, కార్యవర్గ సభ్యులుగా కర్రి ప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, ఆర్.ఆనందరావు, పి.జోగారావు, కె.సోంబాబు, పి.సత్యనారాయణ, మహిళా ప్రతినిధులుగా వై.విమలకుమారి, సూరి దేముడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బి.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాసరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సామల సింహాచలం మాట్లాడుతూ ఎంఇఒల వత్తిపరమైన సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యారంగ అభివద్ధికి కషి చేస్తామని చెప్పారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - భామిని

పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం పూర్తి స్థాయిలో శుభ్రం చేసిన పాత్రలో వండి, భోజనం రుచిగా ఉండాలని ఎంపిడిఒ వి.చంద్రరావు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో పిల్లలకు మధ్యాహ్న భోజనం ఉపయోగించే వంటశాల పరిశుభ్రంగా ఉండాలని, వంటకు వినియోగించే పదార్థాలు పరిశీలించకే వంట చేయాలని, పూర్తి స్థాయిలో ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ పాటిస్తూ, రుచికరంగా ఉండాలని ఎంపిడిఒ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బాబురావు, వంట కార్మికులు వున్నారు.

తల్లిపాల విశిష్ట గురించి వివరిస్తున్న ఉషారాణి

తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తల్లిపాలు వారోత్సవాలపై గర్భిణీలకు అవగాహన ఉండాలని డిపిహెచ్ఎన్ ఉషారాణి అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా స్థానిక వైటిసిలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణీ పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించాలన్నారు. పగలు, రాత్రి బిడ్డను తల్లి వద్దనే క్రమమైన వ్యవధిలో శిశువుకు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు జి.విజయలక్ష్మి, కె.ఆదిలక్ష్మి, ఆరోగ్య సహాయకులు జె.తిరుపతిరావు, వైటిసి మేనేజర్ రాము ఉన్నారు.

రోగికి పెన్షన్ అందించిన సర్పంచ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతినెలా ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ లబ్ధిదారులు ఎక్కడున్నా అందించేలా గుమ్మలక్ష్మీపురం సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్రావు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే కొండ వీధికి చెందిన బండారు ముని అనారోగ్యంతో పార్వతీపురం ఏరియా ఆసుపత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ గ్రామ వాలంటీర్ తో కలిసి ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ అందించారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ వారి కుటుంబ అవసరాలను తీరుస్తుందని ఉద్దేశంతో లబ్ధిదారుల చెంతకే అందించేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ సేవలను గుర్తించి గ్రామస్తులు అభినందించారు.

రోగికి ఆస్పత్రిలో పింఛను అందజేస్తున్న సర్పంచ్, వాలంటీరు

గిరిజనులకు సక్రమంగా వైద్యం అందించాలి

ప్రజాశక్తి -సీతంపేట

గిరిజనులకు సక్రమంగా సక్రమంగా వైద్యమందించాలని మలేరియా జోనల్ అధికారి కె.మధుసూదనరావు అన్నారు. మంగళ వారం ఆయన జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పాలకొండ ఏరియా హాస్పిటల్‌ను సందర్శించారు. అక్కడ డెంగీ పరీక్షలు చేసే పరికరాన్ని పరిశీలించి, నిర్వహించే పరీక్షల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాలకొండ సబ్ యూనిట్ కార్యాలయాన్ని సందర్శించారు. అలాగే డిప్యూటీ డిఎంహెచ్ఒ చిరంజీవి, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగభూషణరావుకు, మలేరియా, డెంగీ కేసులు పరీక్షలు స్క్రీనింగ్ జరిపి, వచ్చిన పాజిటివ్ కేసులను ku ihip, hmfw పోర్టల్‌లో నమోదు జరిగేలా చూడాలని ఆదేశించారు. అనంతరం సీతంపేట ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాథమిక అరోగ్య కేంద్రాలు కుసిమి, దోనుబాయి పిహెచ్‌సిలను సందర్శించారు. మలేరియా, డెంగీ వ్యాధులు దోమలు ద్వారా వ్యాపిస్తాయి. కనుక వ్యాధికారక, కింది స్థాయి సిబ్బంది ద్వారా సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే రెండు ల్యాబ్‌లు పరీక్షించారు. వర్షా కాలంలో మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, సిబ్బంది ఇంటింటా ఫేవర్ సర్వే జరిపి, జ్వర పీడితులను గుర్తించి సక్రమంగా వైద్యం అందేలా పర్యవేక్షక సిబ్బంది చూడాలని ఆదేశించారు. అలాగే సిబ్బంది అలసత్వం వహిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పల్లంకి వలస గ్రామాన్ని సందర్శించారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ మలేరియా అధికారి కెవి ప్రసాద్, డిఎంఒ శ్యాంకుమార్, వైద్యాధికారి భానుప్రతాప్, రవీంద్ర, సబ్‌యూనిట్ అధికారి మోహన్రావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద పల్లకి వలస గ్రామాన్ని సందర్శించిన అధికారులు

లోగో, మస్కట్‌ల కోసం పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగో, మస్కట్ లను రూపొందించుటకు పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎస్. వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలు అక్టోబర్ 2నుండి ప్రారంభమవుతాయని, ఈ క్రీడలు గ్రామ, వార్డు సచివాలయం, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో 46 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఆడుదాం ఆంధ్రాలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు యోగా, మారథాన్, పేరొందిన స్థానిక క్రీడలకు అవకాశం కల్పించడం జరిగిందని ఆయన వివరించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడలకు లోగో, మస్కట్ రూపొందించేందుకు పోటీలను పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయ విద్యార్థులతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ పౌరులు ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. గెలుపొందిన మస్కెట్‌కు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని ఆయన చెప్పారు. ఆన్ లైన్ లో http://sports.ap.gov.in వెబ్ సైట్‌లో ఈనెల నుంచి 7 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. 7న సాయంత్రం పోటీలపై తుది నిర్ణయం ప్రకటిస్తారని చెప్పారు. "ఆంధ్ర ప్రదేశ్ లో క్రీడలు, ఆరోగ్యం, దదత్వం ప్రోత్సహించడం" శీర్షికన పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. లోగో డిజైన్ తో పాటు తెలుగులో టాగ్ లైన్ సమర్పించాలని, మస్కట్ కు ప్రత్యేకంగా సమర్పించాలని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు క్రియేటివ్ కార్నర్ సెక్షన్ లేదా ఇ మెయిల్ ఐడి ద్వారా ఎంట్రీ లను సమర్పించవచ్చని ఆయన చెప్పారు. ఎంట్రీల వివరాలను సంక్షిప్తంగా తెలియజేయాలని, విజేతగా నిలిచినలోగో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ప్రభుత్వానికి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.

కానరాని అధికారుల జాడ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో పలుశాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారు. స్థానికంగా ఉండేందుకు కార్యాలయాల్లేకపోవడంతో ఆర్అండ్‌బి, ఇరిగేషన్, అటవీశాఖల అధికారులు మండల కేంద్రంలోలేని పరిస్థితి. వీరు విధులకు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. గుమ్మలక్ష్మీపురం నుంచి కురుపాం వరకు రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో నిత్యం రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బి రహదారి ఆక్రమణకు గురైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రమాదకర మలుపుల వద్ద పోలీస్ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఆర్అండ్‌బి అధికారులకు పట్టడం లేదు. మరోవైపు ఇరిగేషన్ శాఖ అధికారులు పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఏజెన్సీలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా పాడయ్యాయి. అసలు ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ఉన్నారో, ఎప్పుడు వస్తారో కూడా తెలియని పరిస్థితి. అటవీశాఖ కార్యాలయం కూడా లేకపోవడంతో ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నత స్థాయి, మండల స్థాయి అధికారులకు వంతపడుతున్నారని ఆరోపణలు కూడా బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇదే కొనసాగితే ఏజెన్సీలో అభివృద్ధి పనులు ఎలా జరుగుతాయని గిరిజన సంఘం నాయకులు ప్రశ్నిస్తున్నారు.

వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న సిహెచ్‌డబ్ల్యుఒలు

సిహెచ్‌డబ్ల్యులకు జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి -సాలూరురూరల్

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు నెలనెలా జీతాలు చెల్లించాలని ఆశా, సిహెచ్‌డబ్ల్యుఒ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మామిడిపల్లి వైద్యాధికారికి మంగళవారం వినతిని అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మూడునెలల వేతనాలు నేటికీ చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో పని చేసే వారంతా పేదలేనని, వేతనంపై కుటుంబం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇచ్చేదే తక్కువ వేతనమని, అది కూడా సమయానికి ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలోని హనుమంతువలస సిహెచ్‌డబ్ల్యుఒ చేరిప్పటి నుంచి నేటికి ఒక్క సారి కూడా జీతం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు మాలాంటి చిరుద్యోగులను ఇబ్బందులకు గురుచేయకుండా నెలనెలా జీతాలు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారిని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయడు, సిహెచ్‌డబ్ల్యుఒ ప్రతినిధులు రవణమ్మ, వరలక్ష్మి, పావని, గంగ, సూరమ్మ పాల్గొన్నారు.

సందిగూడలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు దమయంతి

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. మండలంలోని దుమ్మంగి పంచాయతీ సంధిగూడ గిరిజన గ్రామంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైసిపి నాలుగున్నర ఏళ్ల పాలనలో అవినీతికి పెద్దపీత వేశారని, ప్రజల కష్టాలు మరిచారని విమర్శించారు. మద్యం మాఫియా, ఇసుక దోపిడీ విచ్చలవిడిగా రాజ్యమేలుతోందన్నారు. పథకాల పేరుతో ఇచ్చింది గోరంత, దోచుకుంది కొండంత అని అన్నారు. నిత్యవసరల ధరలు పెరుగుదలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఏజెన్సీలో పాఠశాలల విలీనంతో విద్య దూరమవుతుందన్నారు. సాగునీటి వనరులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని మండిపడ్డారు. ప్రజల కష్టాలు తీరాలంటే టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిడ్డిక కొండలరావు, సుదర్శన్‌రావు, రామకృష్ణ, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎటిఎం సాగు విధానాన్ని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు

ఎటిఎం విధానం కూరగాయల రైతులకు ఎంతోమేలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎటిఎం విధాన ద్వారా తక్కువ భూమిలో బహుళకూరగాయలు పండించడం ద్వారా రైతులకు ఆర్థికంగా ఎంతో మేలుకలుగుతుందని, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజు అన్నారు. మంగళవారం పార్వతీపురం మండలంలోని పెద్ద బొండపల్లి, పుట్టూరులో రైతులచే వేయించిన 10 నుంచి 14 రకాల కాయగూరలు, ఆకుకూరలు, దుంపజాతి, తీగజాతి అయిన ఎటిఎం మోడల్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఆయనతో మాట్లాడుతూ రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు 15 సెంట్లు ఈ విధంగా పలు పంటల వల్ల ఆదాయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ పద్ధతిపై గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించి అందరూ ప్రయోజనం పొందేలా అవగాహన కల్పించాలని ఆయన కోరారు. అనంతరం పులిగుమ్మిలో నవధాన్యాల సాగులో 5X5 లో క్రాప్ కటింగ్ చేయించామన్నారు. పై విధంగా క్రాప్ కటింగ్ చేయించడం వల్ల భూమిలో ఎన్ని టన్నుల పచ్చిరొట్ట ఎరువు తయారవుతుందో రైతులకు క్లుప్తంగా వివరించారు. ఈకార్యక్రమంలో మాస్టర్ ట్రైని వైరామారావు రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌కు మెగా మేళా

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సుంకి వద్ద గల లక్ష్మీ బాలాజీ ఆయిల్స్ వారి గెలల సేకరణ, తూనిక కేంద్రం వద్ద ఆయిల్ పామ్ ప్లాంటేషన్ మెగా మేళాను మంగళవారం నిర్వహించారు. ఈ మేళా సందర్భంగా జిల్లాలోని కురుపాం, కొమరాడ, జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో సుమారు 125 హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్ ఫామ్ నాటేందుకు గానూ 20వేల మొక్కలను పంపిణీ చేశారు. మేళా కు విచ్చేసిన జిల్లా ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సతీష్ రాయ్, చీఫ్ ప్లాంటేషన్ మేనేజర్ పి.రమేష్ మాట్లాడుతూ మండలంలోని రైతులు పామ్ ఆయిల్ తోటలను పెద్ద ఎత్తున నాటు కోవాలని, తద్వారా వారి వ్యవసాయాధారిత ఆదాయం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమం ఎంపిపి ఉరిటి రామారావు, సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, ద్వారపురెడ్డి ధంజయ రావు, రైతులు పాల్గొన్నారు.

ఎంపిపి ఆయిల్‌పాం మొక్కలు అందజేస్తున్న ఉద్యానశాఖ ఎడి

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశిక్త - సీతానగరం

భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాము డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక ఇతర రంగాలకు వెళ్తున్నారన్నారు. జీవో 12 14 ను రద్దుచేసి సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేయకూడదన్నారు. సంఘం మండల అధ్యక్షులు కృష్ణ మాట్లాడుతూ ఇసుక పాలసీతో పనుల్లేకుండా చేస్తుందన్నారు. మండల కార్యదర్శి తలాపు రమేష్ మాట్లాడుతూ గుర్తింపు కార్డులివ్వాలని, మరణించిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియో వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల పనుల్లేకపోవడంతో చినబోగిలికి చెందిన గుణుపూరు వాసు భవన నిర్మాణ కార్మికుడు పొలం పనులకు వెళ్లి పాముకాటుకు గురయ్యాడని, తన కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు ఎస్.శంకర్రావు, టి.వెంకటరమణ, గోపీకృష్ణతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భవననిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన భవన నిర్మాణ కార్మికుడ్ని పరామర్శిస్తున్న తోటి కార్మికులు

ఎరువుల కొరత లేకుండా చూడాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈ ఏడాది ఖరీఫ్‌కు రైతులకు ఎటువంటి ఎరువుల కొరత లేకుండా చూడాలని జనసేన నాయకులు కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు బి. శారదను కలిసిన జనసేన నాయకులు వంగల దాలి నాయుడు, అన్నా బత్తుల దుర్గాప్రసాద్ చర్చించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ముమ్మరంగా దమ్ము పనులు చేపడుతున్నారని, కావున అవసరమైన ఎరువులు పురుగు మందులకు ఎటువంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని కోరారు.

మాతా,శిశు శ్రేయస్సే లక్ష్యంగా విధులు : డిఐఒ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మాతా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించి, వారి ఆరోగ్య శ్రేయస్సుకై కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. జిల్లా ఆసుపత్రిలో ఉన్న పిపి యూనిట్‌లో పట్టణ పరిధిలో ఉన్న ఆరోగ్య సిబ్బందికి వైద్యాధికారి డాక్టర్ వై.విజయమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ గర్భిణీలకు, శిశువులకు ఆశా కార్యకర్తలు అందజేసిన వైద్య సేవలను ఎప్పటికప్పుడు ఇ- ఆశా యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల మొదటి వారం తల్లి పాల వారోత్సవాలు సందర్భంగా బిడ్డకు తల్లి పాల ఆవశ్యకత పై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఈ నెల 7 నుండి 12 మధ్యలో నిర్వహించబోయే మిషన్ ఇంద్ర ధనుష్ ప్రోగ్రాంకు సర్వేలో గుర్తించిన టీకా అర్హులు అందరినీ కొత్తగా చేర్చబడిన యూవిన్ పోర్టల్‌లో నమోదు వైద్య సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. లెప్రసీ సర్వే, ఎన్సిడి సర్వే , ఫీవర్ సర్వే తదితర కార్యక్రమాలపై దృష్టి సారించి పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందజేసి నివేదికల పురోగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి. లావణ్య, సూపర్ వైజర్స్ బి. పుష్ప, జయగౌడ్, స్టాఫ్ భారతి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాల్లో జ్వరాలు అధికంగా ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక పిహెచ్‌సి వైద్య అధికారులు జి.ప్రదీప్‌కుమార్, పి.ఉమామహేశ్వరి ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశముందని, వీటిని దృష్టిలో పెట్టుకొని తరచుగా గ్రామాలు సందర్శించాలని సూచించారు. జ్వర పీడితులకు రక్తనమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి పంపించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. గర్భిణీలను కూడా గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలపడేలా చూడాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మండలంలోని బిటివాడ పిహెచ్‌సిలో కూడా వైద్యాధికారులు మానస, నితీశ ఆశ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్దన రావు, పార్వతీ, శాంతి కుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశాలనుద్దేశించి మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహన్‌రావు

సీతానగరం :సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎం.రాధాకాంత్ అన్నారు. మండలంలోని సీతానగరం, పెదఅంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశాడే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ వేయించాలని ప్రాథమిక ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటి సర్వేను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. సమావేశంలో సీతానగరం పిహెచ్‌సి వైద్యాధికారి కె.శిరీష, హెచ్‌విలు సత్యవతి, వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జంపా మృతి తీరని లోటు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జెవివి వ్యవస్థాపక సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి జంపా కృష్ణ కిషోర్ మృతి సమాజానికి తీరని లోటని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. జంపా సోమవారం విజయవాడలో అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. ఈమేరకు మంగళవారం జెవివి నాయకులు జంపా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ 1988 నుండి జన విజ్ఞాన వేదికలో పనిచేస్తున్నారని, సిపిఎం సభ్యుడుగా, బ్యాంక్ ఆఫీసర్స్ యూనియన్ కార్యదర్శిగా, ఫిలిం సొసైటీ అధ్యక్షునిగా, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక కార్యదర్శిగాను పనిచేశారన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు ఎం.రత్నకుమార్, కార్యదర్శి డి.చంద్ర మౌళి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల్లో పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించాలన్నారు జగనన్నకు చెబుదాంలో వచ్చిన సమస్యలు పరిష్కరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

బైకు ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

వీరఘట్టం గ్రామం బొయిడివీధికి చెందిన అంటిపేట లక్ష్మి మహిళ పొలం పనుల నిమిత్తం మంగళవారం ఉదయం పాలకొండ-పార్వతీపురం రహదారి దాటుతుండగా, వెనుక నుంచి అతివేగంగా వస్తున్న బైకుపై వస్తున్న బండి షాజన్ ఢీకొన్నాడు. దీంతో లక్ష్మి తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు వీరఘట్టం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా అసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కానసింగిలో అక్రమంగా నాటు సారా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. గ్రామాల్లో నాటు సారా అమ్మకాలు, వంటకాలు జోరుగా సాగుతున్నాయని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ తిరుపతిరావు ఉన్నారు.